క్లుప్తంగా

వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం పూర్తి



పడమర ఖండ్రికలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వెల్ నెస్ సెంటర్ భవనం

కపిలేశ్వరపురం: మండలంలోని పడమర ఖండ్రిక గ్రామంలోని జగనన్న కాలనీలో వెల్‌నెస్ సెంటర్ భవనం నిర్మాణం పూర్తయి, ప్రారంభానికి సిద్ధంగా ఉంది. తొలివిడతగా రూ.17.50 లక్షలు మంజూరవగా, తర్వాత రూ.3.30 అదనపు నిధులు మంజూరయ్యాయని పంచాయతీరాజ్ జేఈ రాఘవులు తెలిపారు. మొత్తం 20.30 లక్షల వ్యయంతో భవనం వెల్‌నెస్ కేంద్రం నిర్వహణకు తగినట్టుగా నిర్మించామన్నారు. మండలంలో 11 గ్రామాల్లో వెల్‌నెస్ కేంద్ర భవనాలను ప్రభుత్వం మంజూరు చేసిందని త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని జేఈ తెలిపారు.

ఘనంగా గరుడ పంచమి పూజలు



విశేష అలంకరణలో గరుత్మంతుడు

కపిలేశ్వరపురం: అంగరలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గరుడ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు బాల బాలజీ ఆధ్వర్యంలో ఆలయంలోని గరుత్మంతుడి విగ్రహానికి పంచామృతాభిషేకం చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించారు. అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ



పాఠశాలకు బీరువా అందజేస్తున్న దాత రామచంద్రారెడ్డి

రాయవరం: మండలంలోని పసలపూడి కర్రి సుబ్బారెడ్డి మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)కు సోమవారం దాత బీరువాను బహూకరించారు. ద్వారంపూడి మంగయ్యమ్మ తనయుడు రామచంద్రారెడ్డి రూ.20 వేల విలువైన బీరువాను పాఠశాలకు అందజేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు తాడి లక్ష్మణరెడ్డికి అందజేశారు. హెచ్‌ఎం కోరుమిల్లి వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కె.గంగవరం: మండలంలోని రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రామచంద్రపురం ప్రాజెక్టు సీడీపీఓ లక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కూళ్ల శివారు నరజాడ (ఓసీ), దంగేరు-5 (ఎస్సీ)లు రిజర్వేషన్లు ఉన్నాయని ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు ఐసీడీఎస్ కార్యాలయంలో అందించి రశీదు పొందాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

నగదు రహిత లావాదేవీలు ప్రారంభం



డిజిటల్ పేమెంట్ అనంతరం ధ్రువపత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ లక్ష్మీ నరసమ్మ

కె.గంగవరం: గ్రామ సచివాలయంలో సోమవారం నగదు రహిత లావాదేవీలను ప్రారంభించారు. గ్రామానికి చెందిన చిట్టూరి వెంకటరమణ భవన నిర్మాణ ఫీజు నిమిత్తం రూ.4680లను క్యూఆర్ కోడ్ ద్వారా డిజిటల్ పేమెంట్ చేశారు. అనంతరం ఆయనకు సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ భవన నిర్మాణానికి సంబంధించిన ధ్రువపత్రాన్ని అందించారు. ఆమె మాట్లాడుతూ నేటి నుంచి సచివాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ పేమెంట్లు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి ముద్రగడ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

28న తాపేశ్వరంలో ధర్నా

మండపేట: తాపేశ్వరం రోడ్డు నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈనెల 28న తాపేశ్వరంలో ధర్నా చేయనున్నట్టు జేఎస్పీ నాయకులు తెలిపారు. ఎనిమిది నెలలుగా పనులు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. 28వ తేదీలోగా పనులు మొదలు పెట్టకుంటే తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల ప్రజలతో ధర్నా చేస్తామని దూలి జయరాజు, కుంచే ప్రసాద్, గోసాల ప్రసాద్ తెలిపారు.

సాగు సలహా మండళ్లతో ఫలితాలు బాగు

- తోడ్పాటు ఇస్తున్న రైతు భరోసా కేంద్రాలు
- నూతన వ్యవస్థలతో క్షేత్రస్థాయిలో రైతు భాగస్వామ్యం
- రెండు నియోజకవర్గాల్లో ఆరు మండల సాగు సలహా మండళ్లు



కపిలేశ్వరపురం మండల సాగు సలహా మండలి సమావేశంలో రైతు సమస్యలపై చర్చిస్తున్న మండల చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి (ఫైల్)

కపిలేశ్వరపురం: ఒకప్పుడు వ్యవసాయం అంటే సంప్రదాయ పద్ధతులే శరణ్యవ. ప్రపంచమంతా ఒక కుగ్రామంగా మారి విజ్ఞానమూ, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానమూ విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న రోజులివి. వ్యవసాయం శాస్త్రీయంగా సాగాలన్న సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి సచివాలయం పరిధిలో ఒక రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుకు నూతన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. మండలానికి ఒక సాగు సలహా మండలిని ఏర్పాటు చేసి వ్యవసాయ విషయాలపై చర్చించే వేదికను ఉనికిలోకి తెచ్చారు. సాగు సలహా మండళ్లలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నిష్ణాతులైన రైతులు సభ్యులుగా ఉన్నారు. ఆర్‌బీకే స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకూ మూడు విభాగాలుగా ఏర్పాటైన మండళ్ల నిర్వహణ వల్ల క్షేత్రస్థాయిలో రైతు పరిస్థితులను నేరుగా ప్రభుత్వానికి నివేదికలు అందుతున్నాయి.

సాగుసలహా మండళ్ల నిర్మాణం ఇలా...

వైఎస్సార్ ఆర్బీకే, మండల, జిల్లా స్థాయిలలో మూడు విభాగాలుగా ఏర్పాటైన సాగు సలహా మండళ్లలో వ్యవసాయ అనుబంధ సంస్థలన్నింటినీ ప్రభుత్వం ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చింది. ప్రతి నెలలో మొదటి శుక్రవారం ఆర్బీకే స్థాయి సలహా మండలి క్రమం తప్పకుండా సమావేశమై గ్రామంలోని రైతుల సమస్యలు, సూచనలను నేరుగా అధికారులు సేకరిస్తున్నారు. ఆయకట్టు రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకు రాగానే అధికారులు క్షేత్ర పరిశీలనకు వెళ్తున్నారు. రైతుల ద్వారా వ్యక్తమైన అంశాలపై రెండో శుక్రవారం జరిగే మండల స్థాయి సలహా మండలి సమావేశంలో చర్చిస్తున్నారు. మండలస్థాయి సాగు సలహా మండలిలో ఉన్న చైర్మన్, గౌరవ చైర్మన్ ఎమ్మెల్యే, ఏడుగురు సాగు అనుభవం గల రైతులు, ఎంపీడీఓ, వ్యవసాయ అనుబంధ రెవెన్యూ, ఇరిగేషన్, సహకార శాఖల అధికారులు చర్చలో పాల్గొంటున్నారు.

మండలంలో..

కపిలేశ్వరపురం మండలంలోని వల్లూరు, టేకి గ్రామాల్లో శివారు భూములకు నీటి సరఫరా సమస్య వచ్చినపుడు సలహా మండలిలో చర్చకు రావడంతో సమస్య పరిష్కారమైంది. మండల స్థాయీ చర్చల్లో నిర్ధారణకు వచ్చిన అంశాలను, సమస్యలను, రైతుల విన్నపాలను మూడో శుక్రవారం నిర్వహించే అవిభక్త జిల్లాస్థాయి సలహా మండలి సమావేశం దృష్టికి తీసుకెళ్తున్నారు. జిల్లా సాగు సలహా మండలికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి గౌరవ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. చైర్మన్‌తో పాటు 17 మంది రైతులు, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులున్నారు. అలా క్షేత్రస్థాయి నుంచి సేకరించిన అంశాలను జిల్లాలోని మంత్రుల ద్వారా ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తున్నాయి.

మండలం	గ్రామాలు	సాగు విస్తీర్ణం	రైతులు	ఆర్‌బీకే కమిటీలు
రామచంద్రపురం	25	18,806	9,737	21
కె.గంగవరం	26	15,633	8,700	23
కాజులూరు	26	19,382	17,200	23
మండపేట	12	16,985	11,042	22
రాయవరం	12	14,593	12,002	19
కపిలేశ్వరపురం	19	16,333	7,200	19
మొత్తం	120	1,01,732	65,881	127

ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారమవడం ద్వారా సాగు రబీ ప్రక్రియ సజావుగా సాగేందుకు సాగు సలహా మండళ్లు తోడ్పడుతున్నాయి. విత్తన లభ్యత, పెట్టుబడి సాయం అందడంలో సాంకేతిక లోపాలు, వరిని ఆశించే తెగుళ్లు, సాగునీటి సరఫరా, ఎలుకల బెడద, గిట్టుబాటు ధర అమలు, యంత్ర పరికరాల మంజూరు ఇలా అనేక సమస్యలపై ఆయా స్థాయిల్లో చర్చ జరపడంతో సమస్యలు ప్రాథమిక స్థాయిలోనే పరిష్కారం అవుతున్నాయి.

క్షేత్ర పరిశీలనకు అధికారులు



రైతు క్షేత్ర స్థాయిలోని సమస్యను చెప్పగానే వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది వెంటనే క్షేత్ర పరిశీలన చేస్తున్నాం. సలహా మండళ్ల వల్ల ప్రభుత్వ నిర్ణయాలను నేరుగా రైతులకు చెప్పే వీలు కలుగుతుంది. రైతులు, ప్రభుత్వ అధికారుల సమన్వయ కృషితో సాగు సజావుగా సాగుతుంది.

–కేవీఎస్ రమేష్‌కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం

నూతన వ్యవస్థల పనితీరుతో సత్ఫలితాలు



సాగు సలహా మండళ్లు, ఆర్‌బీకే తదితర నూతన వ్యవస్థల పనితీరు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ఆర్‌బీకే, మండల, జిల్లా స్థాయిల్లోని మండళ్లు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతు అభిప్రాయాలను నేరుగా ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ మంత్రులు దృష్టికి రావడంతో వెంటనే పరిష్కారమవుతున్నాయి. రైతు అభిప్రాయాలకు విలువ ఏర్పాటైంది.

–మేడిశెట్టి దుర్గారావు, మండల సాగు సలహామండలి సభ్యుడు, టేకి

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ నవీకరణ శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కపిలేశ్వరపురం, వల్లూరు డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు సేవలందిస్తారు. ఆయా శిబిరాలను సచివాలయ ఉద్యోగులు ఖాజా అహమ్మద్ ఉన్నీషా, ఎంకేడీ భవాని, వి.లక్ష్మీగౌతమి, పంతాడి ఈశ్వరి పర్యవేక్షించనున్నారు. మంగళ, బుధవారాల్లో మాచర, నేలటూరు సచివాలయాల్లోనూ, 24న, 25 తేదీల్లో అంగర, కాలేరు సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించనున్నారు. పదేళ్లుగా ఆధార్‌లోని సమాచారాన్ని నవీకరించుకోని వారు తప్పనిసరిగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రంలో సమాచారాన్ని నవీకరించుకోవాలన్నారు.

గొల్లపాలెంలో నాగుపాము కలకలం



వాటర్ సంపు పైకెక్కి పడగ విప్పి చూస్తున్న నాగుపాము

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం భారీ రక్షిత మంచినీటి పథకం సమీపాన సోమవారం ఒక నాగుపాము కలకలం సృష్టించింది. పోలీస్‌స్టేషన్ పక్కన ఉన్న వాటర్ సంపు పైకెక్కి పడగ విప్పి ఉండిపోయింది. గంటల తరబడి పాము ఎటూ కలదలకుండా ఉండిపోవటంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివరాల్లోకి వెళితే మండల గ్రామాల్లోని సబ్ వాటర్ ట్యాంకులకు నీరు విడుదల చేసేందుకు ట్యాంక్ ఆపరేటర్ వాటర్ సంపు వద్దకు వెళ్లాడు. వాల్వ్ తిప్పుతుండగా సంపులో నుంచి నాగుపాము పైపు ద్వారా పైకి రావటం గమనించి దూరంగా పరుగులు తీశాడు. స్థానికులు, ఇతర సిబ్బంది వచ్చి పామును కొట్టేందుకు ప్రయత్నించినా వీలు లేకుండా పోయింది. ఎట్టకేలకు ఒక యువకుడు కర్ర సహాయంతో పామును బయటకు తీసి తెలివిగా మట్టుపెట్టాడు. వాటర్ సంపులో కప్పల కోసం పాము దిగి ఉంటుందని పైకి ఎక్కలేక పైపుపై కొంత వరకూ ఎక్కి ఉండిపోయిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

త్వరలో గ్రంథాలయం ప్రారంభోత్సవం



కళావేదికను పరిశీలిస్తున్న పురుషోత్తమరావు దంపతులు, ఉపాధ్యాయులు

మండపేట: ఏడిద గ్రామంలో తన తల్లిదండ్రులు నామాల వీర్రాజు, సీతారత్నం పేరిట దాదాపు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రంథాలయం, కళావేదికలను త్వరలో ప్రారంభించనున్నట్టు పారిశ్రామికవేత్త పురుషోత్తమరావు తెలిపారు. తన సతీమణి అనంతలక్ష్మి, రిటైర్డ్ హెచ్‌ఎం గెడా శ్రీనివాసరావు తదితరులతో కలిసి సోమవారం ఆయన భవనాలను పరిశీలించారు. విద్యార్థుల సౌలభ్యం కోసం జెడ్పీ హైస్కూల్‌లో కళావేదికను, గ్రామస్తుల కోసం రథం గుడి వద్ద గ్రంథాలయ నిర్మించామన్నారు. విద్యతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవడం ద్వారా అభివృద్ధి సాధించవచ్చన్నారు. విద్యార్థులు, గ్రామస్తులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని పురుషోత్తమరావు కోరారు. సుమారు రూ.రెండు కోట్ల వ్యయంతో పాఠశాలలో నూతన భవనాలను నిర్మించడంతో పాటు ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తూ గ్రామాభివృద్ధికి ఎనలేని తోడ్పాటు అందిస్తున్న పురుషోత్తమరావుకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం ముంగర వెంకటరాజు, పి.వెంకటరత్నం, సిద్ధాంతపు వీర్రాజు, బొబ్బారామయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సంతృప్తికరమైన సేవలు గుర్తింపునిస్తాయి



రాయవరం ఎస్సైను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రాయవరం: ప్రభుత్వాధికారులు ప్రజలకు అందించే సేవల ద్వారా వారికి గుర్తింపు లభిస్తుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ బదిలీ సందర్భంగా ప్రస్తుత ఎస్సై నరేష్ అధ్యక్షతన సోమవారం రాత్రి వీడ్కోలు సభ నిర్వహించారు. సమావేశంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, రాయవరం గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, పారిశ్రామికవేత్త కొవ్వూరి సత్యనారాయణరెడ్డి(సత్తిబాబు) తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల జీవితంలో బదిలీ తప్పనిసరి అన్నారు. ఉద్యోగులు వారు ప్రజలకు అందించే సేవలు వారి సంతృప్త స్థాయిని పెంచే విధంగా ఉండాలన్నారు. అనంతరం ఎస్సై సురేష్ దంపతులను రాయవరం స్టేషన్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు దుశ్శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్సై పి.వెంకటేశ్వరరావు, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి ప్రాణవాయువును పెంచండి



మొక్క నాటుతున్న డీఎస్పీ ప్రసాద్ తదితరులు

రామచంద్రపురం: మొక్కలను నాటడం ద్వారా స్వచ్ఛమైన ప్రాణవాయువును భావితరాలను వారికి అందించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. విశ్వచైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మిషన్ ప్రకృతిలో భాగంగా పట్టణంలో గత నాలుగేళ్లుగా మొక్కలను నాటుతూ వాటిని పరిరక్షిస్తున్నారు. అందులో భాగంగా స్థానిక వైఎస్సార్ నగర్ కాలనీ రోడ్డులో డీఎస్పీ ప్రసాద్ చేతుల మీదుగా 800వ మొక్క నాటారు. డీఎస్పీ ప్రసాద్ మాట్లాడుతూ కాలుష్యం పెరిగిపోతున్న దృష్ట్యా మొక్కలను నాటి పెంచడం ద్వారా మంచి ప్రాణవాయువు వెలువడుతుందన్నారు. విశ్వచైతన్య శక్తి చారిటబుల్ ట్రస్టు ఈ మంచి కార్యక్రమం చేయటం అభినందనీయమని ట్రస్ట్ వ్యవస్థాపకుడు విజయ్‌ను డీఎస్పీ అభినందించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కనకాల వెంకటేశ్వరరావు, బుల్లిశ్వరప్రసాద్‌ల సహకారంతో ఈ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. కంచుమర్తి బాబూరావు, గొల్లపల్లి కృష్ణ, బుంగా రాజు, ట్రస్టు సభ్యులు ఆలీ హుస్సేన్, అక్కిరెడ్డి శ్రీను, కృష్ణ, జగన్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి భక్తుల పూజలు



ద్రాక్షారామలో సోమవారం హల్‌చల్ చేసిన నాగులు

రామచంద్రపురం రూరల్: శ్రావణ మాసంలో వచ్చే నాగ పంచమి, గరుడ పంచమి పురస్కరించుకుని భక్తులు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసియున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. నాగదోషం, శత్రు ఇబ్బందులు, సంతానం పుట్టి చనిపోతున్న వారు స్వామిని దర్శించుకుని దోష నివారణ పూజలు చేసుకున్నారు. అశ్వత్థ నారాయణ వృక్షం వద్ద సర్ప ప్రతిష్ఠలు, పూజలు చేసుకున్నారు.

నాగపంచమి రోజున నాగుపాముల హల్‌చల్..

ఇదిలా ఉండగా భక్తులు ఆలయాల్లోని నాగ దేవతల విగ్రహాలకు పూజలు చేస్తుంటే భీమేశ్వరాలయానికి సమీపాన పెచ్చెట్టి శంకరరావుకు చెందిన బిల్డింగ్ మెటీరియల్ షాపులో నాగుపాముల జంట హల్‌చల్ చేసింది. నాగ పంచమి రోజున ఈ దృశ్యం చూడటం విశేషంగా స్థానికులు పేర్కొన్నారు.

పంట తెగుళ్లపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచి తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని తిప్పరాజుపాలెం, చేదువాడ, కాజులూరు తదితర గ్రామాల్లో ఏఓ అశోక్ పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. తిప్పరాజుపాలెంలో ఆయన మాట్లాడుతూ వరిసాగులో పంట తొలి దశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రస్తుతం అధిక ఉష్ణోగ్రత, మధ్యమధ్యలో చెదురు మదురు వర్షాల కారణంగా వరి పంట పలు రకాల వ్యాధులు, తెగుళ్ల బారిన పడుతుందన్నారు. మండల గ్రామాల్లోని పంటపై అక్కడక్కడా బ్యాక్టీరియా ఎండాకు తెగులు, పొడతెగులు, లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. రైతులు ఆర్బీకేల్లో వ్యవసాయశాఖ సిబ్బంది సూచనల మేరకూ తగిన సమయంలో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. తెగుళ్ల లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు.



కొనసాగుతున్న వరినాట్లు

వేధిస్తున్న నారు కొరత



రైతులు ఆటోపై ఎగువ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసుకుని పొలాల్లో దించుతున్న వరి నారు

కాజులూరు: ఆగస్టు నెల పూర్తి కావస్తున్నా రామచంద్రపురం నియోజకవర్గ గ్రామాల్లో అక్కడక్కడా కొన్నిచోట్ల ఈ ఏడాది నేటికీ వరినాట్లు కొనసాగుతున్నాయి. పోసిన నారు సక్రమంగా మొలవక నారు కొరత తలెత్తటంతో నాట్లు ఆలస్యమైనట్టు రైతులు చెబుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 65 వేల ఎకరాల సాగుభూమి ఉండగా ప్రస్తుత ఖరీఫ్‌లో 54 వేల ఎకరాల్లో రైతులు సాగుకు సిద్ధమౌతున్నట్టు వ్యవసాయాధికారుల అంచనా. కొందరు రైతులు వెదజల్లిక విధానాన్ని అవలంబించగా కొందరు రైతులు నాట్లు వేసే విధానాన్ని కొనసాగిస్తున్నారు. గత నెల చివరి వారంలో కురిసిన చెదురుమదురు వర్షాలు నియోజకవర్గంలో నారుమడులు చల్లిన రైతులను తీవ్రంగా నష్టాలకు గురి చేశాయి. వర్షాలు కురిసే సమయానికి దాదాపు అన్ని గ్రామాల్లోనూ రైతులు నారు, వెదజల్లికలు చల్లారు. వర్షపునీరు పొలంలో నిలిచి ఉండిపోవటంతో నారుచల్లిన పొలాల్లో మొలకల దశలో ఉన్నా వరి గింజ కుళ్లిపోయింది. వెదజల్లిన పొలంలోను మొక్క సరిగా మొలకెత్తక పోవడంతోనూ మధ్యమధ్యలో నాట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసుకున్న నారు సరిపోకపోవడంతో రైతులు నారును కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అక్కడక్కడ రైతులకు నారు సరిపడకపోగా కొందరు రైతులకు ఎక్కువయ్యేది. దీంతో ఒకరికి ఒకరు సర్దుబాటు చేసుకునేవారు. ప్రస్తుతం అధిక శాతం రైతులకు నారు కొరత ఏర్పడడంతో స్థానికంగా నారు దొరకడం లేదు. రైతులు ఎగువ ప్రాంతం నుంచి నారు కొనుగోలు చేసుకుని తీసుకువస్తున్నారు. ఎకరాకు సరిపడా నారు రవాణా ఖర్చులతో కలిపి సుమారు రూ.ఆరు నుంచి ఎనిమిది వేలు దాటుతుందని రైతులు చెబుతున్నారు. మరలా నారు పోసి అది ఎదిగిన తరువాత నాట్లు వేద్దామనుకున్నా ఇప్పటికే తీవ్రంగా ఆలస్యమైందని దీంతో అధిక వ్యయానికి గురైనా నారు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది కూలీ రేట్లు అధికంగా ఉండడంతో నాట్ల దశలోనే వరిసాగుకు భారీ వ్యయాలు వెచ్చించాల్సి వస్తుందని దీనిపై నారు కొరత తమను మరింత ఇబ్బందులకు గురిచేస్తుందని రైతులు వాపోతున్నారు.

వర్షాలకు తీవ్రంగా నష్టపోయాం



ఈ ఏడాది నియోజకవర్గంలో భారీ వర్షాలు లేకపోయినప్పటికీ గత నెల చివరివారంలో కురిసిన వర్షాలు రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. వర్షాలు కురిసే సమయానికి నారు, వెదజల్లికలు చేసి ఉన్నాము. వర్షపునీరు పొలాల్లో నిలిచి ఉండిపోవటంతో నారు, వెదజల్లిన పొలాల్లో మొలకల దశలో ఉన్నా వరి గింజ కుళ్లిపోయి నారుకొరత ఏర్పడింది.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు మొగలిపాలెం